క్లుప్తంగా

శివరాత్రికి 13 స్పెషల్ సర్వీసులు

సత్యవేడు: శివరాత్రికి సత్యవేడు డిపోనుంచి 13 స్పెషల్ సర్వీసుల బస్సులు నడుపుతున్నట్లు డీఎం వెంకటరమణ తెలిపారు. సత్యవేడు నుంచి సురుటుపల్లె, రామగిరి, కైలాసకోన, సదాశివ కోనకు 9 సర్వీసులు, వరదయ్యపాళెం నుంచి సిద్ధలయ్యకోన(అవంతి కోన)కు 3 బస్సులు, శ్రీకాళహస్తికి 9 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ శిబిరానికి స్పందన


పెరిందేశంలో ఆధార్ శిబిరం

కేవీబీపురం: మండలంలో పెరిందేశంలోని సచివాలయంలో బుధవారం ఆధార్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 200 మంది ఆధార్ సేవలను వినియోగించుకున్నారు. ఎంపీడీఓ రామచంద్ర మాట్లాడుతూ, గతంలో ఆధార్ సేవల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ప్రజల విజ్ఞప్తి మేరకు వారంలో ఒక రోజు ప్రతి గ్రామంలో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రతి సచివాలయంలోనూ ఆధార్ సేవలను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఏలు దాము, రమేష్, ఎంపీటీసీ అను, సర్పంచ్ మురగమ్మ, నాయకులు మాధవయ్య, సుబ్బరామనాయుడు, బత్తెయ్య, వీఆర్‌ఓ మునిరాము, రియాజ్‌ఖాన్, వలంటీర్లు పాల్గొన్నారు.

పైపులైను గొడవ

- వ్యక్తిపై దాడి : ముగ్గురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో ఓ వ్యక్తిపై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. మంగళవారం తాగునీటి కుళాయి కోసం పైపులైను వేసుకుంటున్న మేర్లపాకకు చెందిన పాపిరెడ్డిపై గ్రామస్తులు లతమ్మ, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి అసభ్యంగా దూషిస్తూ దాడి చేశారని, ప్రాథమిక విచారణ అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణా

- లోకేష్ ఆరోపణలు అవాస్తవం
- జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్

పిచ్చాటూరు: ప్రభుత్వ నిబంధనల మేరకే అరుణానది ఇసుక రీచ్ నుంచి ఇసుక రవాణా చేస్తున్నారని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ స్పష్టం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపణలపై సుమన్ స్పందించారు. బుధవారం సాయంత్రం పిచ్చాటూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రీచ్‌ను నిర్వహిస్తున్నారని, మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని లోకేష్ ఆరోపించడం శోచనీయమని, దీనిని ఖండిస్తున్నట్టు చెప్పారు.

వైద్యం అందక మహిళ పరిస్థితి విషమం

- సిబ్బంది నిర్లక్ష్యం
- సర్వే పేరుతో విధులకు డుమ్మా!


కేవీబీపురం పీహెచ్‌సీ

కేవీబీపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఓ మూర్ఛరోగికి సమయానికి వైద్యం అందకపోవడంతో ఆ మహిళ పరిస్థితి విషమంగా మారిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని ఓళ్లూరుకు చెందిన రేఖ(34) నిరుపేద మహిళ. నాలుగు రోజుల నుంచి తీవ్ర జ్వరం కారణంగా మూర్ఛకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ఉదయం సుమారు 7.30 గంటలకు కేవీబీపురం పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో 34 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. ప్రస్తుతం ఆ మహిళకు వైద్యం అందుతున్నప్పటికీ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


సిబ్బంది ఫుల్..వైద్య నిల్

కేవీబీపురం పీహెచ్‌సీలో ఇద్దరు ప్రధాన వైద్యులు, 13 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. హాజరు పట్టికలో సంతకాలు చేస్తున్నా సిబ్బంది మాత్రం పీహెచ్‌సీలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. మంగళవారం రాత్రివిధుల్లో ఉన్న సచివాలయ ఏఎన్ఎంలు కూడా తెల్లవారు జామున ఇంటికి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఎవరూ లేకపోవడం గమనార్హం! ఫలితంగా రేఖకు వైద్యం కరువైంది. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌బాబును వివరణ కోరగా.. ఆస్పత్రిలో ఏం జరిగిందో తనకేమీ తెలియదని ఆయన చెప్పారు.

గడువు పెంచరూ!

శ్రీకాళహస్తి: పెన్షనర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లైఫ్ సర్టిఫికెట్లు, ఈకేవైసీ ప్రక్రియ గడువును ఏప్రిల్ వరకు పెంచాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి తాలుకా యూనిట్ ప్రధాన కార్యదర్శి బి.వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

‘ముక్కంటి’కి విద్యుత్ సొబగులు



శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు శ్రీకాళహస్తికి కొత్త సొబగులు అద్దాయి. శోభాయమానంగా విద్యుద్దీప కాంతుల్లో ఆలయం భక్తులు, పట్టణవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆయన సూచనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయించారు. ఫలితంగా ఈ ఏడాది ఆలయం వెలుపల, పట్టణ శివారులో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విద్యుత్ దీపాల కటౌట్లు భక్తి పారవశ్యాన్ని రేకెత్తిస్తున్నాయి.

–శ్రీకాళహస్తి

సాంస్కృతికం.. సమ్మోహనం




మాండలిన్ మాస్ట్రో రాజేష్, గోవిందరాజుల బృందం ప్రదర్శన, నటరాజ కళాక్షేత్రం కళాకారుల నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో బుధవారం ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. సంగీత కళానిధి మాండలిన్ మాస్ట్రో రాజేష్, గోవిందరాజుల బృందం మాండలిక్ ఫ్యూజన్ కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. బెంగళూరుకి చెందిన అనూష యాష్, అపర్ణ, సుదీష్, జూలుగంటి మోన్విత, ఆషా, శ్రీమేధా, కోట యామిని, శ్రీభవానీ తమ నృత్య ప్రదర్శనతో సమ్మోహితుల్ని చేశారు. గిద్దలూరు రమణయ్య భగవద్గీత శ్లోక పఠనం, రమణ భక్తి రంజని కార్యక్రమాలతో భక్తులు పరవశులయ్యారు. పెద్దకనపర్తికి చెందిన శ్రీ శివపార్వతి కళామండలి పల్లమాల వెంకట్రామయ్య బృందం శ్రీరామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటిక ప్రదర్శించింది.

ముక్కంటి ఆలయానికి గోదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థాన గోశాలకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం జడ్లకోడూరుకు చెందిన చెవులుగుంట కృష్ణయ్య, వెంకటమ్మ దంపతులు గోదానం చేశారు. పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సమక్షంలో గోవును అందజేశారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, గోశాల అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి తాళిబొట్లు సమర్పణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవేరి అయిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన నేలటూరి గోపీనాథ్‌రెడ్డి 24 గ్రాముల బంగారు తాళిబొట్టును సమర్పించారు. దీనిని పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సతీష్ మాలిక్, కల్యాణి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.





గోదాతలు కృష్ణయ్య, వెంకటమ్మ, తాళిబొట్టును అందజేస్తున్న గోపీనాథ్‌రెడ్డి, నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న ఖజారియా ప్రతినిధులు. కూరగాయలను వితరణ చేస్తున్న బెంగళూరు వాసులు

నిత్యాన్నదానానికి బెంగళూరు వాసుల వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన కేఆర్ మార్కెట్ నిర్వాహకులు 10 టన్నుల కూరగాయలను పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఖజారియా సిరామిక్స్, టైల్స్ పరిశ్రమ ప్రతినిధులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని పాలకమండలి ఛైర్మన్‌కు అందజేశారు.

ముక్కంటి ఆలయానికి మైక్‌సెట్లు..

శ్రీకాళహస్తి: నరసారావుపేటకు చెందిన శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ అధినేత డి.శ్రీనివాసులు బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి మైక్‌సెట్లు, హారన్ సెట్లు, ఆంప్లిఫ్లయర్లను వితరణ చేశారు. వీటిని పాలకమండలి ఛైర్మన్‌కు అందజేశారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించండి


మహిళలతో మాట్లాడుతున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): పేద ప్రజల సంక్షేమానికి పట్టం కట్టిన అధికార వైఎస్సార్ సీపీకి మరోసారి ఎన్నికల్లో పట్టం కట్టాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి కోరారు. బుధవారం చిట్టత్తూరు అరుంధతివాడ గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. జగనన్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులు అందరికీ అందుతున్నాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చిట్టత్తూరు సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నరసింహులు, భక్తవత్సలం, పట్టాభి రెడ్డి, చెంగారెడ్డి, గిరి రెడ్డి, శివమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

● అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి: రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్ బుధవారం అభినందించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన చాణిక్య, ఝాన్సీ ఇటీవల విజయవాడలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించారు. 90 కేజీల విభాగంగా చాణిక్య, 50 కేజీల విభాగంలో ఝాన్సీ రజత, బంగారు పతకాలు సాధించారు. వారిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పీడీ సరోజిని, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి టీడీపీ తిలోదకాలు !

- శివరాత్రి రోజున శ్రీకాళహస్తి మాడవీధుల్లో లోకేష్ ర్యాలీకి టీడీపీ సన్నాహాలు
- విరుద్ధమంటున్న వేద పండితులు



రేణిగుంట: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి 13 రోజులు ఉత్సవాలు ముగిసే వరకు శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధుల్లో ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించకూడదన్న సాంప్రదాయానికి తెలుగుదేశం పార్టీ తిలోదకాలిస్తోందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా టీడీపీ శ్రేణులు శివరాత్రి రోజున శ్రీకాళహస్తిలోని నాలుగు మాడ వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై బుధవారం శ్రీకాళహస్తిలోని శ్రీ చండికాంబికా పీఠం పురోహితులు సింగరాజు ప్రకాశం శాస్త్రి బుధవారం ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. శివరాత్రి మహోత్సవం ప్రారంభమైన తర్వాత జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవాలు ముగిసే వరకు శ్రీకాళహస్తిలో ఇతర ఏ ఉత్సవాలు ఇప్పటివరకు నిర్వహించలేదని, చతుర్మాడ వీధుల్లో ఎలాంటి ఫ్లెక్సీలు, రాజకీయ బ్యానర్లు లేకుండా చూడాలని ఆయన కోరారు. అలాగే ఎలాంటి ర్యాలీలు, సభలు జరగకుండా తగు చర్యలు తీసుకుని సంప్రదాయాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు.

సమగ్రంగా వివరాల నమోదు

సత్యవేడు: అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనతతో బాధ పడుతున్న గర్భవతులు, బాలింతలు, పిల్లలు వివరాలను సుస్థిర అభివృద్ధి ప్రణాళి పట్టికలో సమగ్రంగా నమోదు చేయాలని సీడీపీఓ దేవకుమారి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 165 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, తక్కువ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు లేని పిల్లల వివరాలు నమోదు చేయాలన్నారు. వైఎస్సార్ యాప్‌లో పోషకాహార కేంద్రంలో నిల్వ, పంపిణీ వివరాల రికార్డు సక్రమంగా ఉండాలన్నారు. శివరాత్రికి ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్టు సమాచారం అందితే వారి తల్లిదండ్రులకు, బాలికకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు పి.సంధ్య, ఎం.జ్యోతి, డి.శ్రీదేవి, కే.యమున, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ‘రేడియో కిసాన్ దివస్’


మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

రేణిగుంట: తిరుపతి ఆకాశవాణి సౌజన్యంతో బుధవారం మండలంలోని కరకంబాడి వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రేడియో కిసాన్ దివస్‌ను నిర్వహించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు చిరు ధాన్యాల సాగు, ఆహారంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఆహారం విషతుల్యమవుతున్న ప్రస్తు పరిస్థితుల్లో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని కోరారు. చిరు ధాన్యాలైన రాగి, సజ్జ, జొన్న, కొర్ర, అండు కొర్రలు, సామలు, వరిగలు, అరికలను రైతులు విరివిగా సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన స్థానం విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్, ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సుధాకర్ మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవీలత, హేమలత, శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రామకుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న రహీం

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లె పంచాయతీ రామకృష్ణాపురంలో బుధవారం రాస్ ఆధ్వర్యంలో టాటా గ్రూపు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు దేవరపల్లి రహీం ప్రారంభించారు. రోగులను పరీక్షించి వైద్య నిపుణులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కో–ఆర్డినేటర్ హేమంత్‌కుమార్, టాటా గ్రూపు కో–ఆర్డినేటర్ నాగరాజు, శ్రీనివాస్, సునీత, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, రహంతుల్లా, శీను తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం కూలీల హక్కు

- గుంటకిందపల్లెలో ఉపాధి కూలీలతో పీడీ

శ్రీకాళహస్తి రూరల్: ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మండలంలోని గుంటకిందపల్లెలో చేస్తున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కనీస వేతనం కూలీల హక్కుఅని, కూలీలు ఏమాత్రం వారి దినసరి వేతనాన్ని నష్టపోరాదన్నారు. కూలీలు కోరిన వెంటనే పనులు కల్పించే బాధ్యత క్షేత్రసహాయకులపై ఉందని, ఒక వేళ పనులు కల్పించకపోతే తన దృష్టికి తేవాలని కూలీలకు సూచించారు. పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీవో కృష్ణయ్యను ఆదేశించారు. తమకు గిట్టుబాటు కూలీ లభించడం లేదని, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవని కూలీలు సమస్యలు నివేదించారు. కూలీలు రోజుకు కనీసం నాలుగు గంటలు కష్టపడితే రూ.257 గిట్టుబాటు లభిస్తుందని, అయితే కొందరు రెండు గంటలు కూడా పనిచేయడం లేదని పీడీ చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, రాజు, మునిశేఖర్, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికార నందిపై ఆదిదేవుని కటాక్షం


అధికార నంది వాహనంపై విహరిస్తున్న భోళాశంకరుడు, పల్లకిలో పార్వతిదేవి


వాహన సేవలో ఉభయదారులు, అర్చకులు, గ్రామ పెద్దలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని ప్రముఖ సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వ స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి ఆదిదేవుడైన శ్రీ వాల్మీకేశ్వర స్వామి అధికార నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల ‘ఓం నమఃశివాయ..’ నామస్మరణలతో మార్మోగింది. ఉదయం ఆలయంలో కొలువుదీరిన స్వయంభు వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిగ తాయారు, పళ్లికొండేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, దాంపత్య దక్షిణామూర్తిలకు వివిధ పుష్పాలంకరణ, ప్రత్యేక అభిషేకం చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్స మూర్తులను పట్టుపీతాంబరాలు గజ పుష్పమాలలు, విశేషాభరణాలతో అలంకరించి అధికార వాహనంపై వాల్మీకేశ్వర స్వామి, పల్లకిలో పార్వతీదేవి అధిష్ఠించి పురవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపు ముందు చిన్నారుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఉభయదారులుగా ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

గ్రామోత్సవ వివాదం

- తొండమాన్‌పురం, తొండమనాడు గ్రామస్తులతో వేర్వేరుగా సీఐ సమావేశం
- టీటీడీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి
- అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక


గ్రామస్తులతో సమావేశమైన సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి రూరల్: బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో టీటీడీ అధికారుల నిర్ణయానికి ఇరు గ్రామాలు కట్టుబడి ఉండాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో తొండమాన్‌పురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామోత్సవం నిర్వహణపై తొండమాన్‌పురం, తొండమనాడు గ్రామస్తులకు కొన్నిరోజులుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తి రూరల్ సీఐ, తొండమాన్‌పురం గ్రామ సచివాలయం, తొండమనాడు జెడ్పీ హైస్కూలులో గ్రామస్తులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. తొండమాన్‌పురం వాసులు మాట్లాడుతూ, తమ గ్రామ పురాతన ఆలయాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీటీడీకి అనుబంధం చేశారని, అప్పుడే ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో ఆలయాన్ని అధునాతనంగా నిర్మించారని, 2016లో మహా కుంభాభిషేక వేడుకలు, ఆ తర్వాత 2017, 2018లో టీటీడీ ఆధ్వర్యంలోనే స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించారని, 2019లో పొరుగు పంచాయతీ తొండమనాడు ప్రజలు గ్రామోత్సవం తమ గ్రామంలో కూడా నిర్వహించాలని పట్టుబడడంతో అప్పటి నుంచి గ్రామోత్సవం నిర్వహించడం లేదన్నారు. గతంలో గ్రామోత్సవం ఏ రీతిలో నిర్వహించేవారో అదేలా ఈ ఏడాది కూడా నిర్వహించాలని, తొండమనాడు గ్రామానికి తీసుకెళ్లకుండా గుడి లోపలే ఉత్సవం నిర్వహిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. తొండమనాడు గ్రామస్తులు మాట్లాడుతూ, తమ గ్రామంలో కూడా గ్రామోత్సవం నిర్వహించి స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించాలని, తొండమాన్‌పురంలో గ్రామోత్సవం నిర్వహిస్తే తమ గ్రామంలో కూడా నిర్వహించాల్సిందేనన్నారు. లేకపోతే గుడిలోపలే ఉత్సవం నిర్వహణకు తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



శ్రీకాళహస్తి : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్ఐలు, ఏర్పేడు మండలంలో..

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలు చేస్తే శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమైన అనర్థాలు కలుగుతాయని శ్రీకాళహస్తి1, 2వ పట్టణ ఎస్ఐలు తిమ్మయ్య, మహేష్‌బాబు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాలను నిరోధించాలని పట్టణంలోని వరదరాజ స్వామి ఆలయం నుంచి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐలు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. చిన్నవయసులో వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. అలా ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కౌట్స్ మండలి మాజీ సభ్యులు రమేష్‌బాబు, క్యాంప్ ఆఫీసర్ ఉమేష్‌రావు, గైడ్స్ కెప్టెన్లు సులోచన, సావిత్రి, స్కౌట్ మాస్టర్లు అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, మహేంద్ర పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేద్దామని ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ముసలిపేడు, బత్తినయ్య ఎస్టీ కాలనీలో బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో బాల్య వివాహాలు చేస్తుంటారని, పేదరికం, నిరక్షరాస్యతతో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ఇలాంటి వివాహాలు జరిగే అవకాశాలున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రగతి ట్రస్ట్ ప్రతినిధులు చెంచు రామయ్య, పృథ్వీరాజ్, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రేణిగుంట : వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో...

వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో..

రేణిగుంట: బాల్య వివాహాలను రూపు మాపి పుస్తకాలు పట్టే వయస్సులో పుస్తెల భారాన్ని దూరం చేయాలని ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు అన్నారు. మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో బుధవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోదండరామిరెడ్డి, పార్థసారథి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీని నిర్మూలిద్దాం


తొండమాన్‌పురం ఇసుక బట్టీ వద్ద కూలీలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

శ్రీకాళహస్తి రూరల్: వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ప్యానల్ న్యాయవాది ,చిన్న అంకయ్య అన్నారు. తొండమాన్‌పురంలోని ఇసుక బట్టీలో పనిచేస్తున్న కూలీలకు బుధవారం న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంకయ్య మాట్లాడుతూ, విధిలేక అప్పులు తీసుకున్న వారిచేత వెట్టి చాకిరీ చేయించినా, నిర్బంధించి పనులు చేయించినా నేరమన్నారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, లేబర్ ఆఫీసర్, విజిలెన్స్ కమిటీలు, పోలీసు అధికారులు దృష్టి సారించారని, ఎవరికైనా అన్యాయం జరిగితే కోర్టులను ఆశ్రయించవచ్చన్నారు. సర్పంచ్ బత్రి హేమభూషణ్‌రెడ్డి, లేబరాఫీసర్ రంగనాథ్, లీగల్ వలంటీర్ బాలు, కోర్టు సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

టీచర్ల ఇంటి బాట

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థుల ఇళ్ల సందర్శన


తలారివెట్టులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూలులో పదవ తరగతి మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు ఇంటి బాట కార్యక్రమానికి పూనుకున్నట్టు ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. మండలంలోని తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లో పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాదెండ్ల మురళి రాత్రి పూట వెళ్లి చదువుతున్నారా, లేదా, అని పర్యవేక్షించి, విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు విద్యార్థుల ఇళ్లకు వెళుతున్నట్టు చెప్పారు. విద్యార్థులు ఆ సమయంలో చదువుతున్న పాఠాలేమిటో తెలుసుకుని పలు సూచనలు ఇవ్వడంతోపాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడటం వలన మంచి ఫలితం ఉంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.